ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 15 జనవరి 2024 | 5





అమలాపురం ఎస్వీఆర్ నగర్‌లో భోగి మంటలో పిడకల దండ వేస్తున్న మెట్రోకెమ్ అధినేత నందెపు బాలాజీ

బరిలోకి!

- తొలిరోజు రూ.30 కోట్లకుపైనే కోడి పందాలు, గుండాటలు, పేకాటలు
- షరా 'మామూలు'గానే పోలీసు యంత్రాంగం
- కులాలు, పార్టీలవారీగా బరులు
- పందెం బరులను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పర్వదినాల్లో తొలి రోజే జిల్లాలో జూద క్రీడల జాతర హోరెత్తిపోయింది. ఎక్కడికక్కడే కోడి పందాలు, గుండాటలు, పేకాట పోటీలను పెద్ద సంఖ్యలో ప్రజలు తిలకించారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా వందకు పైగా బరుల్లో తొలిరోజు రూ.30కోట్ల మధ్య చేతులు మారినట్టు సమాచారం. వందలాది గుండాట బోర్డులతో లక్షలాది మంది ప్రజలను నిలువునా దోచేస్తున్నారు. కొన్నిచోట్ల కులాలు, రాజకీయ పార్టీల వారీగా పందెం బరులను ఏర్పాటుచేశారు. అధికార వైసీపీకి చెందిన కీలక ప్రజాప్రతినిధులు పందెం బరులను లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ పోలీసుల అండదండలతోనే 'షరా మామూళ్ల'గానే జూద క్రీడల జాతర సాగుతోంది. సార్వత్రిక ఎన్నికలు రానుండడంతో ఎలాగూ బదిలీ అవుతామనే ఉద్దేశ్యంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసు అధికారులు ఎక్కడికక్కడే నిర్వాహకులతో రేట్లు మాట్లాడుకుని అనుమతులిచ్చేశారు. మంత్రి విశ్వరూప్ నియోజకవర్గంలో అమలాపురం పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లో పందెం బరులు, గుండాటలు జోరుగా సాగుతున్నాయి. మండపేటలో ఐదుచోట్ల, రామచంద్రపురం పట్టణంలో బైపాస్ రోడ్డు, వి.సావరం, ముత్యాలమ్మ గుడి సమీపంలో పందెంబరులు ఏర్పాటు చేశారు. ఎప్పుడూ మంత్రి చెల్లుబోయిన వేణు హవాతో సాగే బరులను ఈసారి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల చెంతనే నిర్వహిస్తున్నారు. పలు బరుల వద్ద స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కాట్రేనికోన మండలం వేట్లపాలెం వద్ద, కామనగరువు శివారు ఢిల్లీ పబ్లిక్ స్కూలు వద్ద సమీపాన బరుల వద్ద యువకుల మధ్య ఘర్షణ తలెత్తింది.

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎక్కడికక్కడే హైవేలు, ప్రధాన రహదారుల చెంతనే కోడిపందాలు, గుండాట బరులను ఏర్పాటుచేసి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు. పలుచోట్ల ట్రాఫిక్ కూడా స్తంభించింది. ఫ్లడ్ లైట్ల వెలుగులో కోడిపందాల ముసుగులో గుండాటలు మాత్రం లక్షల్లో జరుగుతున్నాయి. సాక్షాత్తూ రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు మలికిపురం, లక్కవరాల్లో కోడిపందాలు, గుండాటలను ప్రారంభించి స్వయంగా జూద క్రీడల్లో డబ్బులు కాసి గుండాటల్లో పాల్గొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పందెం బరులను ప్రారంభించి నిర్వాహకులకు ఉత్తేజాన్నిచ్చారు. పి.గన్నవరం మండలంలో జి.పెదపూడితో పాటు మరోచోట పేకాట పోటీలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన జూదరులు ఇక్కడికి తరలివచ్చారు. ఇక మెగా బరిగా ఉన్న కాట్రేనికోన మండలం దొంతికుర్రు వద్ద లక్షల్లో గుండాటలు, కోడిపందాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడకు చేరుకుని తిలకించారు. లక్షల రూపాయల మేర గుండాట్లో పణంగా పెట్టి నష్టపోయిన బాధితులు లబోదిబోమంటున్నారు. పందెంబరులు, గుండాట ప్రాంతాల ప్రాంగణాలు భారీగా కార్లు, మోటారు సైకిళ్లతో కిక్కిరిసిపోయాయి. పలుచోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది.

కాగా పందాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఇప్పటి వరకు బహిరంగంగా హెచ్చరించిన రెవెన్యూ, పోలీసు అధికారులు పత్తా లేకుండా పోయారు. హైకోర్టు ఆదేశాలను సైతం ఎక్కడా పాటించట్లేదు. పోలీసులు గుండాటలు, కోడిపందాలు జరిగే ప్రాంతాల్లో వీడియోలు తీయించాలని న్యాయస్థానం ఆదేశించినప్పటికీ ఆ దిశగా ఏర్పాట్లు జరగట్లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా సంక్రాంతి జూద జాతరలో మాత్రం అన్ని రాజకీయ పార్టీల నేతలు పాల్గొంటున్నారు. వారి పేరిట ఫ్లెక్సులు కూడా పెట్టి ఆహ్వానాలు పలకడం విశేషం.



కాట్రేనికోన మండలం గెద్దనపల్లిలో కోడి పందాలను తిలకిస్తున్న ప్రజలు



గుండాట ఆడుతున్న దృశ్యం

వైభవంగా భోగి

- కోనసీమ పల్లెలకు సంక్రాంతి శోభ
- ప్రభుత్వ వ్యతిరేక జీవో ప్రతులను భోగి మంటల్లో వేసిన టీడీపీ, జనసేన నేతలు

అమలాపురం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): కోనసీమ పల్లెలు సంక్రాంతి శోభ సంతరించుకున్నాయి. జిల్లాలో వీధివీధినా భోగి మంటలు వేశారు. చిన్నారులు, పెద్దలు వేకువజామునే సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వెలిగించి భోగి దండలు వేశారు. కొన్నిచోట్ల భారీ భోగి దండలతో ప్రదర్శనలు నిర్వహించారు. జగన్ ప్రభుత్వం జారీ చేసిన వివిధ జీవోల ప్రతులను టీడీపీ, జనసేన నాయకులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. అమలాపురం ఎస్వీఆర్ నగర్‌లో మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) కుటుంబ సభ్యులు భోగి మంట వెలిగించారు. నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు గంగిరెద్దులు, ఎడ్ల బండ్లు ఆకట్టుకున్నాయి.

వాడపల్లిలో ఘనంగా గోదారంగనాథుల కల్యాణం... 7లో

సంక్రాంతి 'పల్లె పులకింత'



- పల్లెకొచ్చిన పెద్ద పండుగ.. ● పట్టణాలు ఖాళీ.. గ్రామాల్లో కళ కళ ● గ్రామాలకు నగరవాసుల పరుగులు
- ఉరుకుల పరుగుల జీవనానికి కాస్త బ్రేక్.. ● నాలుగు రోజుల ఆనందం కోసం ఎగిరొచ్చిన బంధుగణం



(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పల్లె వాకిళ్లు పులకరించే రోజు.. నగరవాసులు పుట్టిపెరిగిన మట్టి వాసన గుండెనిండా నింపుకొనే రోజు, సహవాసగాళ్లతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని మనసు తేలిక చేసుకునేరోజు, ఆడాళ్లు కష్టసుఖాలు పంచుకొనే రోజు.. పిన్నీ, మామ, తాత అంటూ పిల్లలు ఇల్లంతా గోల చేసే రోజు.. బావను ఆట పట్టించే మరదళ్లు.. తొడగొట్టే పందెం పుంజు.. మతిపోగొట్టే పడతుల అందాలు.. కొత్త అల్లుళ్లు.. అత్తవారి వంటకాలు.. మామగారి మర్యాదలు.. అమ్మమ్మ ఆశీస్సులు.. తాతయ్య మొట్టికాయలు.. ఒకటేమిటి పట్టణాల పరుగుల జీవనంలో కోల్పోయే మమకారం, ఆప్యాయత, అనురాగం, ఓదార్పు, మనశ్శాంతిని మూడురోజుల్లో మళ్లీ రీచార్జ్ చేసే రోజు సంక్రాంతి. ఈ ఏడాదీ ఆ ఉత్సాహం పల్లెలకు ఉరుకుల పరుగున వచ్చేసింది. పల్లె ఒడిలో కల్మషం లేకుండా దొరికే కలగలుపు కూర కోసం అను బంధాలు రెక్కలు కట్టుకుని వాలిపోయాయి. భోగి రోజున అర్ధరాత్రి నుంచే భోగి మంటలను వెలిగించారు. చిన్నారుల తలపై భోగి పళ్లు పోసి మురిసిపోయారు. భోగి రోజున బంధువులు కొందరు చేరుకోవడం ఆలస్యమైనా సంక్రాంతికి బాంధవ్యం చెంత చేరిపోయారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, అరిసెలు, పొంగడాలు, జంతికలు, కజ్జికాయలు ఆశ్చర్యంగా చూస్తూ ఈ తరం పిల్లలు వాటి తెలుగు పేర్లను సెల్‌ఫోన్‌లో ఇంగ్లీషులో తర్జుమా చేసుకొని తెలుసుకోవడంలో బిజీ అయిపోయారు. బావా బామ్మర్దులు, అన్నాదమ్ములు.. ఇలా పందెం పుంజులను యుద్ధాలకు తీసుకెళ్లడానికి సిద్ధమైపోయారు. పల్లె వాకిళ్ల గంగిరెద్దులు తొక్కడం కోసం గొబ్బెమ్మలను సిద్ధం చేసుకున్నాయి. ఇంకేముంది పట్టణాలు బోసిపోగా.. పల్లెల్లో సంక్రాంతి సందడి ఉట్టిపడుతోంది. పండుగ శోభ పరవశింపజేస్తోంది.

● **సంబరాల కోసం పరుగున**

అన్ని పండుగల్లో సంక్రాంతి పండుగ భిన్నమైనది. వినాయకచవితి, కృష్ణాష్టమి, దీపావళి మాదిరిగా కాకుండా సంక్రాంతి పూర్తిగా సంబురాల పండుగ. ముఖ్యంగా ఐదేళ్ల నోట్లోకి వెళ్లడానికి కారణమైన పంట పొలాలు, పశువులకు కృతజ్ఞతలు తెలుపుకొనే గొప్ప రోజు. పల్లె రుణం తీర్చుకొనే రోజు. అందుకే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఈ నాలుగు రోజులూ సరదా సంతోషాలకే ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదంతా ఉరుకులతో గడిపే పట్టణవాసానికి ఏడాదికి మూడు రోజులు సెలవిచ్చి ఈ ఉల్లాసం కోసం ఉత్సాహంగా సొంతూళ్లకు.. పల్లెల్లోని బంధువుల ఇళ్లకు పరుగున వచ్చేస్తారు. ఒకరకంగా తెలుగువారింట ఈ పెద్ద పండుగ బంధాలకు కావలి కాస్తుందంటే అతిశయోక్తి కాదు.

● **ఎలాగైనా వెళ్లి రావలె..**

రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్, బస్సుల్లో జాగా లేదు, విమానంలో సీట్లు లేవు, హైవేపై కార్ల క్యూ.. అయినా.. ఎలాగైనా వెళ్లి రావలె.. అదే సంక్రాంతి గొప్పతనం. సంక్రాంతి వచ్చిందంటే ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో సందడి మాటల్లో చెప్పేది కాదు. కన్నుల పండువను కళ్ల ముందుకు తెస్తోంది. అందువల్ల జీవనోపాధికి ఎంత దూరంలో ఉన్నా సంక్రాంతికి సొంతూరుకు చేరుకోవాల్సిందే. మూడు రోజులూ బంధువులతో ఎంజాయ్ చేయాల్సిందే. దీంతో కాస్త కష్టం అనుభవించి నా పల్లెకు చేరుకున్నాక ప్రయాణ బడలికను పండుగ సరదాల్లో కలిపేస్తున్నారు. పండుగకు రెండు మూడు నెలల నుంచే రైళ్లకు రిజర్వేషన్ చేయించుకున్నా కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఇబ్బందులు పడుతూనే పల్లెబాట పట్టారు. పండుగకు ఎక్కువగా హైదరాబాద్ నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడ స్థిరపడిన గోదారోళ్లు పెద్ద పండక్కి అరు నూరైనా.. నూరు నూటపాతికైనా వచ్చి వెళ్లాల్సిందే. ప్రత్యేక రైళ్లు వేసినా.. ఆర్టీసీ సుమారు 60 ప్రత్యేక బస్సులను నడిపినా.. ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు బాదేసినా.. తిప్పలు పడుతూనే సొంతూళ్లకు వచ్చేశారు. అటు విమానాల్లో కూడా టికెట్లు దొరకని పరిస్థితి ఉన్నా 'తగ్గేదేలె' అంటూ రెక్కలు కట్టుకొని వాలిపోయారు. దీంతో పల్లె తనవాళ్లను చూసి మురిసిపోతోంది.

● **సంక్రాంతి నూతన కాంతే కదా!**

సంప్రదాయాలు, ఆచారాల్లో భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఇమిడి ఉంటాయని పెద్దల ఉవాచ. సంక్రాంతి అంటే నూతన కాంతి అని అర్థం. పంటలు చేతికొచ్చి గాదెలు ధాన్యంతో కళకళలాడే వేళ. సంక్రాంతిలో నిగూఢంగా ఉన్న మర్మాలు ఉన్నాయి. ఛాందసత్వాన్ని పక్కపెట్టి శాస్త్రీయంగా అర్థం చేసుకుంటే ఆ అంతరార్థాలు ఏమిటో అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చని ఆ తరం వారు హితబోధ చేస్తున్నారు. ఉరుకుల పరుగుల ఆధునిక జీవనంలో.. ఫోనులో ముఖాలను చూసుకుంటూ పలకరింపుల జీవితంలో అసలే బంధాలు పలుచబడిపోయాయనేది ఏవరూ కాదనలేని వాస్తవం. పిల్లలకు చుట్టాలు ఎవరో, ఎవరు వరుసకు ఏమవుతారో తెలియదు. అప్పుడప్పుడు లేదా ఎప్పుడో ఒకసారి ఫోనులో మాట్లాడుకోవడం మినహా మనసులోని మాటలను నేరుగా పంచుకున్నదీ లేదు. దీంతో సంక్రాంతి లేకుంటే అసలే అంతంత మాత్రంగా ఉన్న బంధాలు కాలగర్భంలో కలిసిపోయేవేనని పెద్దలు పడే బాధకు పెద్ద పండుగ కాస్త సాంత్వన చేకూరుస్తోంది. పెద్ద పండుగకు ఇల్లు శుభ్రం చేసుకోవడం.. అనవసరమైన వస్తువులను వదిలించుకోవడం ప్రధానమైనది. మూడు నాలుగు రోజుల నుంచే.. ఒక్కో ఇంట్లో నెల రోజుల నుంచే పండుగ పనులు మొదలు పెడతారు. ఏడాదికి ఒకసారి మెగా స్వచ్ఛభారత్ అన్నమాట. ఇప్పటి తరం వాళ్లకు ముగ్గులంటే తెలియదు. ఒకవేళ అడిగితే రుచి ఎలా ఉంటుందని ఎదురు ప్రశ్నించినా ఆశ్చర్యపోనవసరం లేదు. గతంలో లోగిళ్లలో వేసే ముగ్గులు మహిళలకు సహజ వ్యాయామంగా ఉండేవి. కూర గుమ్మడి కాయ సాధారణంగా అధికశాతం మంది విని యోగించరు. కానీ సంక్రాంతి కలగలుపు కూరలో గుమ్మడి ఉండా ల్సిందే. గుమ్మడి పోషకాల గని అని వైద్యశాస్త్రం చెబుతోంది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఆవులు, గేదెలకు సెలవు వచ్చినట్లే. ఏడాదంతా పశువులు చాకిరీ చేసి ఇల్లు గడవడంలో తోడ్పడతాయి. వాటికి కృతజ్ఞతలు చెప్పుకొనే గొప్పరోజు సంక్రాంతి. అందుకే కనుమ రోజున కాకైనా కదలదనే నానుడి ఉండనే ఉంది. పితృదేవతలను స్మరించుకోవడం సంక్రాతి రోజున అధికశాతం మంది ప్రధానంగా ఆచరిస్తారు. జనసామాన్యంలో మూలన పెట్టుకోవడం అంటారు. కొత్త వస్త్రాలు, పిండివంటలు, కూరగాయలు తదితర పదార్థాలు వారికి నివేదించుకోవడంతో పండుగను ప్రారంభిస్తారు. కోడి పందేలకు తరతరాల చరిత్ర ఉంది. ఒకప్పుడు కత్తులు వాడేవాళ్లు కాదు. కానీ రానురాను కత్తులు కడితేనే కోడిపందేలు అన్నట్లుగా పరిస్థితి పశుహింసకు దారితీసింది. కత్తులు కట్టి, డబ్బులు పెట్టి జూదంగా మార్చేశారు. ఒకప్పుడు ఇద్దరు మనుషులు లేదా ఊళ్ల మధ్య వివాదాలు ఏర్పడితే కోడి పందెం ద్వారా పరిష్కారం చూపే వారు. పౌరుషానికి ప్రతీకగా కోడి పందేలను చూసేవారు. పల్నాటి కాలంలో మాచర్ల, గురజాల జరిగిన గొడవ యుద్ధానికి దారితీయగా పెద్దలు కోడి పందెం ద్వారా సమస్యను పరిష్కరించారని చరిత్ర చెబుతోంది. ఏడాదంతా అమ్మగారింటికి రాకపోయినా సంక్రాంతికి కచ్చితంగా ఆడపిల్లలు పుట్టింటికి వస్తారు. భర్త, ఆయన తరపు వారు కూడా ఈ పండుగ రోజున వాళ్లకు అడ్డుచెప్పరు. అందుకే అత్తవారిల్లు అల్లుడు, కూతురు, పిల్లలతో మూడు రోజులూ కళకళలాడుతుంది.ఇలా భోగి పండ్లు(రేగు), గొబ్బెమ్మలు, హరిదా సులు, గంగిరెద్దులు, గాలిపటాలు.. ఇలా సంప్రదాయంలో దాగి ఉన్న ఆరోగ్య జీవన విధానానికి అవసరమైన ఎన్నిటినో సంక్రాంతి పండుగ మనకు దూరం కాకుండా చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు.. భావితరాలు.. బంధాలకు దూరం కాకుండా పహారా కాస్తోంది.

ఓ రోజు ముందుకు సంక్రాంతి

ఎవరైనా గమనించారా!.. సంక్రాంతి పండుగ ఓ రోజు ముందుకు జరిగింది. జనవరి 14న వచ్చే పండుగ 2008 నుంచీ జనవరి 15న వస్తోంది. ఎందుకంటారా?.. దీనికో కారణం చెబుతున్నారు జ్యోతి ష్కులు. సూర్యుడి ప్రతి ఏడాదీ మకర సంక్రమణం చేసిన రోజున సంక్రాంతి జరుపుకుంటాం. సంక్రాంతి అంటే నూతన కాంతి. ఇలా జరిగే క్రమంలో ప్రతి ఏడాదీ 20 నిమిషాలు ఆలస్యం అవుతుంది. స్థూల గణన చేస్తే మూడేళ్లకు ఒక గంట, 72 ఏళ్లకు ఒక రోజు అవుతుంది. అందువల్ల ప్రస్తుతం జనవరి 15కి జరిగింది. 1935 నుంచీ 2007 వరకూ 72 ఏళ్ల పాటు జనవరి 14న సంక్రాంతి జరుపుకున్నారు. 2008 నుంచి 2080 వరకూ 15న సంక్రాంతి వస్తోంది. 2081 నుంచి 2153 వరకూ మరోరోజు ముందుకు జరిగి 16న ఈ పండుగ జరుపుకుంటారని చెబుతున్నారు.



కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఊరేగిస్తున్న దృశ్యం(ఫైలు)

కొత్తపేటలో నేడు ప్రభల ఉత్సవం

కొత్తపేట, జనవరి 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సోమవారం జరిగే సంక్రాంతి ప్రభల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రం నలుమూలలు నుంచి లక్షలాదిగా సందర్శకులు రానున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు, అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ప్రభల ఉత్సవం జరపడం ఇక్కడ అనాదిగా వస్తోంది. ప్రభల ఉత్సవం మూడు ప్రధాన వీధుల మధ్య పోటాపోటీగా సాగుతోంది. ముందుగా పాత రామాలయం మునసుబు గారి ప్రభ వీరభద్రుని అలంకరించుకుని పురవీధుల్లోకి ప్రవేశిస్తుంది. వాటిని అనుకరిస్తూ మిగిలిన విధుల ప్రభలు సాంస్కృతిక ప్రదర్శన మధ్య ఊరేగింపుగా బయల్దేరుతాయి. బోడిపాలెం ప్రభ భక్తఆంజనేయునిగా అలంకరించుకుని రెండో ఊరేగింపు ప్రారంభమవుతుంది. కొత్తరామాలయం ప్రభ రాజరాజేశ్వరిదేవిగా అలంకరించుకుని ఆయా వీధుల ప్రభలను వెంట బెట్టుకుని మూడవ ఊరేగింపు మొదలవుతుంది. మొత్తం మూడు ఊరేగింపులు కొత్తపేట ఉన్నత పాఠశాల మైదానంలోకి చేరుకుని భక్తుల సందర్శనార్థం కొలువై ఉంటాయి. బాణసంచా పోటాపోటీ కాల్పులు చూపరులను కట్టిపడేస్తాయి. తిరిగి రాత్రి పదకొండు గంటలకు ప్రభల ఊరేగింపు పురవీధుల్లో వివిధ సంస్కృతిక ప్రదర్శనల నడుమ తెల్లవారుజామున నాలుగు గంటలకు పాతబస్టాండు సెంటరుకు చేరుకుంటుంది. పాత, కొత్త రామాలయం వీధుల మధ్య పోటాపోటీ బాణసంచా కాల్పులతో ప్రభల ఉత్సవం ముగుస్తుంది. అమలాపురం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో 500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు

● వేడుకలు ప్రారంభించిన తపోవనం స్వామీజీ



రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామీజీ

అన్నవరం, జనవరి 14: సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వేకువజామున 5గంటలకు స్వామి,అమ్మవార్లను మేళతాళాలతో వార్షిక కల్యాణవేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. తపోవనం సచ్చిదానంద స్వామీజీ ప్రత్యేకపూజలు నిర్వహించి భోగిమంట వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎడ్లబండి, దాన్యపురాసులు, కుమ్మరిచక్రం, బొమ్మలకొలువు, సంక్రాంతి పిండివంటలు, తాటిచెట్టు, ఈతచెట్టు ఏర్పాటు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్లెటూరు వాతావరణం ప్రతిబింబించే విధంగా ఏర్పాట్లుచేసిన ఈవో రామచంద్రమోహన్‌ను పలువురు అభినందించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన పట్నం భక్తులకు ఆలయప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన పల్లెటూరు వాతావరణం తిలకించి ఆనందించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన కళాకృతులు వద్ద స్వీయచిత్రాలు తీసుకున్నారు.

అంతర్వేదిలో కలెక్టర్ దంపతుల పూజలు



కలెక్టరు హిమాన్షు శుక్లా దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ

అంతర్వేది, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఆదివారం కాకినాడ, కోనసీమ జిల్లాల కలెక్టర్లు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లాలు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా భోగి పండుగ

● ద్రాక్షారామలో 800 అడుగుల భోగి పిడకల దండ



ద్రాక్షారామలో 800 అడుగుల భోగిపిడకల దండతో కోటిపల్లి కుటుంబ సభ్యులు

ద్రాక్షారామ, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపు రం మండలం ద్రాక్షారామకు చెందిన కోటిపల్లి సత్యనారాయణ, కోటిపల్లి లోవరాజు, కోటిపల్లి రాజు సోదరులు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా పిల్లా పాపలతో కలసి సమీపంలో ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద భోగిమంటలో 800 అడుగుల భోగిదండ వేశారు.

ఏడువేల భోగి పిడకలతో ..



పిఠాపురంలోని కోటగుమ్మం సెంటర్‌లో ఏడువేల భోగిపిడకల దండతో..

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న జైగణేష్ దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగి మంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భోగిమంట చుట్టూ పుష్పాలు, ముగ్గులు, మామిడితోరణాలు, కొబ్బరి ఆకులతో సంప్రదాయబద్ధంగా అలంకారం చేశారు. భోగిమంటల్లో ప్రత్యేకంగా తయారు చేయించిన ఏడువేల భోగిపిడకల దండను తెచ్చి వేశారు. అనంతరం చిన్నారులకు భోగిపళ్లు వేసి ఆశీర్వాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరుగగా, కమిటీ ప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

గుమ్మిలేరులో భోగిదండ ఊరేగింపు..

ఆలమూరు: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో ఉరదాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 600మీటర్ల భోగి దండ తయారు చేశారు. ఆదివారం దానిని మంగళ వాయిద్యాల నడుమ భారీగా ఊరేగించి గుమ్మిలేరు సెంటర్లో ఏర్పాటు చేసిన భోగి మంటలో వేశారు. ఊరేగింపులో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి సంప్రదాయలను పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ఏడు సంవత్సరా లుగా భారీ భోగి దండలు తయారు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ ఈదల శ్రీనివాస్ తెలిపారు.



ఆలమూరు: గుమ్మిలేరులో భారీ భోగిదండను ఊరేగిస్తున్న ఉరదాలమ్మ ఆలయ భక్తులు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

● వేలాది తరలివచ్చిన భక్తజనం



గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సందర్భంగా గోదా రంగనాథుల దివ్య కల్యాణాన్ని వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రాహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు కల్యాణాన్ని జరిపించారు. వివాహం కాని యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు-హైమా పార్వతి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొనగా ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశా రు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలపుతూ ఏర్పాటుచేసిన ఫల, పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్య రామమందిరం చూద్దాం రండి ఫొటో షూట్ వద్ద భక్తులు సందడి చేశారు. మహారాష్ట్రకు చెందిన పూణే కళాకారుల డ్రమ్స్, కేరళ కళాకారుల గరుడ వేషాలు, తమిళనాడుకు చెందిన తాంబులం వాయిద్య కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

పోటా పోటీగా బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ సెమీ ఫైనల్స్ పోటీలు ఆదివారం పోటాపోటీగా జరిగాయి. ఈపోటీల్లో సెయింట్స్ జట్టుపై గుంటూరు జట్టు, అనంతపురం జట్టుపై టీఎస్ఏ కాకినాడజట్టు, వైజాగ్ జట్టుపై మార్టేరు జట్టు విజయం సాధించాయి. అలాగే రాజమండ్రి సీటీఏ జట్టుపై ఖమ్మం జట్టు, అమలాపురం జట్టుపై రామచంద్రపురంజట్టు, రాజమండ్రి సీటీఏ జట్టుపై హైదరాబాద్ డీటీఏ జట్టు, గుంటూరు జట్టుపై ఆక్టేరి జట్టు గెలుపొందాయి. సోమవారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. పట్టణ ప్రముఖ డాక్టర్ చెలికాని స్టాలిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

మహాసంస్థానంలో విదేశీ భక్తుల పూజలు

● స్పానిష్ భాషలోకి శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం



స్పానిష్ బాషలోకి అనువదించిన శ్రీపాద శ్రీవల్లభ చరితామృతం పుస్తకాన్ని ఆలయానికి అందజేస్తున్న స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాల భక్తులు

పిఠాపురం, జనవరి 14: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని ఆదివారం పలువురు విదేశీ భక్తులు సందర్శించారు. స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన భక్తులు శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా వారు స్పానిష్ భాషలోకి అనువదించిన శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం పుస్తకాలను మహాసంస్థానానికి సమర్పించారు. విదేశీ భక్తులను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ రెడ్డెం జనార్ధనరావు, కార్య నిర్వహణాధికారి ఆర్.సౌజన్యలు ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, మరాఠీ తదితర భాషలతోపాటు పలు దేశీయ భాషల్లో ముద్రించిన విశేష ప్రాచుర్యం పొందిన శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం పుస్తకం తొలిసారి విదేశీ భాషలోకి అనువదించబడిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

ఎక్కడో మారుమూల

పేకాడితే పట్టుకుంటారా?

- కోడిపందాలు, గుండాటలకు మాత్రం అనుమతులా
- సామర్లకోట పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి వీరంగం



పోలీస్ స్టేషన్ వద్ద వీరంగం చేస్తున్న యువకుడు

సామర్లకోట, జనవరి 14: కాకినాడ జిల్లా సామర్లకోట పోలీసుస్టేషన్ ఎదుట ఒక యువకుడు మద్యం మ త్తులో ఆదివారం వీరంగం చే శాడు. మండల పరిధిలో కోడిపందాలు, గుండాటలను అనుమతించిన పోలీసులు తాను పేకాడుతుండగా పోలీ స్టేషన్‌కు తీసుకొచ్చి సామ ర్లకోట పోలీసులు తనను నిర్బంధించడం పట్ల పోలీసుస్టేషన్ ఎదుట అలజడి సృష్టించాడు. చొక్కా విప్పుకుని బ్లేడ్‌తో పొట్టపై కోసుకుంటూ పోలీసులను దుర్భాషలాడుతూ 20నిమిషాలపాటు హల్‌చల్ చేసి ఒక దశలో రోడ్డుపై ఉన్న రాళ్లనుతెచ్చి పోలీ సుస్టేషన్‌పైకి విసిరికొట్టాడు. మండలంలో కోడిపందాలు, గుండాటలు జోరుగా జరుగుతున్న ప్పటికీ ఎక్కడో మారుమూల పేకాడుతున్న తనను ఎందుకు నిర్బంధించారంటూ పోలీసులపై తీవ్రమైన స్వరంతో ప్రశ్నల వర్షం కురిపించాడు. అన్ని ఆటలు పట్టించండి అంటూ నినాదాలు చేశాడు. ఆ సమయంలో సదరు యువకుడిని నివారించేందుకు స్టేషన్‌లోఉన్న పోలీసులు అంతగా సాహ సించలేదు. కొద్దిసేపటి తర్వాత స్టేషన్ బయటే అతడిని కూర్చొబెట్టారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



ప్రత్తిపాడు, జనవరి 14: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్‌లో 16వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరిజిల్లా రంగంపేటకు చెందిన గాజువిల్లి శ్రీను అతడి భార్య అపర్ణ(19) మోటార్‌బైక్‌పై బంధువుల ఇంటికి ప్రత్తిపాడు మండలం రాచపల్లి బయల్దేరారు. ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్‌వద్ద కంటైనర్ లారీ వేగంగా ఢీ కొనడంతో బైక్‌పై వెనుక కూర్చున్న అపర్ణ అక్కడికక్కడే మృతి చెందింది. పండుగపూట అమ్మమ్మ ఊరు వెళతున్న అపర్ణ మృత్యువాత పడడంతో కుటుంబీకులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

● భార్య, పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయారని మనస్తాపం



పిఠాపురంలో సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

పిఠాపురం, జనవరి 14: కాకినాడజిల్లా పిఠాపురంలోని అగ్రహారంలో సెల్‌టవర్ ఎక్కి ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన పిల్లా దుర్గారావుకు, అతడి భార్యకు ఇటీవల గొడవ జరిగింది. దీంతో పిల్లలను తీసుకుని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్య తనను వదిలి వెళ్లిపోయిందని మనస్తాపానికిగురైన దుర్గారావు సెల్‌టవర్ ఎక్కాడు. భార్య తిరిగి కాపురానికి వస్తేనే తాను దిగుతానని మొండికేశాడు. అక్కడకు చేరుకున్న పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్ దుర్గారావుతో చర్చించి కిందకు దింపి పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదానికి గురైన కర్రి అర్జునరావు

గండేపల్లి, జనవరి 14: కాకినాడజిల్లా పెద్దాపురం మండలం నీలాద్రిపేట గ్రామ శివారులో ఆసుపత్రి జంక్షన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నీలాద్రిపేట గ్రామానికి చెందిన కర్రి అర్జునరావు(45) మృతి చెందాడు. స్థానిక పోలీసుల సమాచారం ప్రకారం... అర్జునరావు తన సొంత గ్రామం నుంచి పిండి ఆడించేందుకు జగ్గంపేట వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఆదిత్య జంక్షన్ వచ్చేసరికి రోడ్డు దాటుతున్న సమయంలో రాజమండ్రి నుంచి జగ్గంపేట వైపు వెళ్లే లారీ అతడి బైక్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం కాగా జగ్గంపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు చనిపోయినట్లు డాక్టర్ ఇచ్చిన రిపోర్టుపై గండేపల్లి ఎస్ఐ ఎం.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు పూర్తి

● పలువురు ప్రముఖుల పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 14: జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. అనారోగ్యం కారణంగా ఆమె శనివారం మృతి చెందిన విషయం విదితమే. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని నివాసం నుంచి ఆమె పార్థివదేహాన్ని ఉదయం 10గంటలకు ఇన్నీసుపేట కైలాస భూమికి తరలించారు. అక్కడ అంత్యక్రియలను దుర్గేష్ తనయుడు డాక్టర్ తేజ పూర్తి చేశారు. తొలుత ఉషారాణి పార్థివదేహాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీఉండవల్లి అరుణ్‌కుమార్, ఎంపీలు మార్గాని భరత్‌కుమార్, పిల్లి సుభాష్ చంద్ర బోస్, డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాల రాయుడు, జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ.రామారావు, నగర అధ్యక్షుడు వై.శ్రీను, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, కనకాల రాజా, చేరుకూరి వెంకట రామారావు సందర్శించి నివాళులర్పించారు. దుర్గేష్‌ను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ఆయన కుమారుడు డాక్టర్ తేజను పరామర్శిస్తున్న నాయకులు

ప్రాచీన సంప్రదాయాలను పరిరక్షించాలి

ఆలమూరు, జనవరి 14: ప్రాచీన సంప్రదాయాలను పరిరక్షించి నేటి తరానికి తెలియజేయాలని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. ఆలమూరు అప్పయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామి అధ్వర్యంలో ఆలయ కమిటీ నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆదివారం ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వైట్ల సత్యనారాయణ, వాసంశెట్టి దుర్గాభవానీ, కర్రి నాగిరెడ్డి, నార్కెడిమిల్లి వెంకన్నబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- పల్లెలు, గ్రామాల్లో భోగి మంటలు
- భోగి పిడకలు వేసిన చిన్నారులు
- ఆలయాలు భక్తులతో కిటకిట

వైభవంగా భోగ భాగ్యాల భోగి






అయినవిల్లి వినాయకుడి ఆవరణలో, సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయం ఆవరణలో భోగి మంటలు, మామిడికుదురు: కొమరాడలో 160 అడుగుల పిడకల దండ ఊరేగింపు, అమలాపురం: రంగాపురంలో 800 అడుగుల భారీ భోగిపిడికల దండను ఊరేగిస్తున్న గ్రామస్తులు

అమలాపురం టౌన్, జనవరి 14: పట్టణంలోని గారపాటి వీధికి చెందిన కాలనీవాసులు నెలరోజులు శ్రమించి ఆవు పేడతో పిడకలు తయారుచేసి 1,500అడుగులభోగి దండను ప్రత్యేకంగా తయారు చేశారు. ఆదివారం దానిని నల్లా శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ గండి దేవిహారిక, దంగేటి శ్రీహరి, తోరం రాము, కోకా రాంబాబు తదితరుల ఆధ్వర్యంలో మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి భోగి మంటల్లో వేశారు.సమనస రంగాపురంలో భూపతిరాజు విశ్వనాథరాజు కుటుంబ సభ్యులు తయారుచేసిన 800అడుగుల భోగి దండను గ్రామంలో ఊరేగించి భోగి మంటల్లో వేశారు.

అంతర్వేది: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజల అనంతరం భోగి మంట వెలిగించారు. ఆలయ ప్రధాన గోపురం వద్ద ఎడ్ల బండ్లు, అరటిచెట్లతో శోభాయమానంగా అలంకరించి భోగిమంటను వేశారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలా డింది. ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని ప్రతీ గ్రామంలో భోగిమంటలు వేసి చిన్నారులు పిడకల దండులేశారు.

అంబాజీపేట: భోగి పండుగను చిన్నారులు, యువకులు ఆదివారం ఆనాందోత్సవాలతో జరుపుకున్నారు. యువకులు భోగి మంటలను వేశారు. వేకువజామున చిన్నారులు భోగి పిడకలను మంటలో వేశారు. గ్రామాల్లో చిన్నారులకు భోగి పళ్లను పోశారు. మండలంలోని గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న శ్రీవీరేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయంలోచామంతి పువ్వుల పూజ నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు చేపట్టారు. మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ముమ్మిడివరం: భోగి పండుగను ప్రజలు ఆదివారం సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. గ్రామాల్లో నాలుగు కూడళ్లలో భోగిమంటలు వేశారు. చిన్నారులు తెల్లవారుజామునే తలస్నానాలు ఆచరించి నూతన దుస్తులు ధరించి భోగి మంటల్లో పిడకల దండలు వేశారు. చిన్నారులకు భోగి పండ్లు వేసి వేడుకలు జరుపుకున్నారు. గ్రామాల్లో లోగిళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. ఆడపడుచులు, కొత్త అల్లుళ్ల రావడంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

అయినవిల్లి: సంక్రాంతి పర్వదినాల్లో భాగంగా గ్రామాల్లో ఆనందోత్సాహాలతో భోగిమంటలు వేశారు. నూతన వస్త్రాలు ధరించి భోగి మంటల్లో భోగి దండలు వేశారు. గ్రామాల్లో ఆలయాలను సుందరంగా అలంకరించారు. అయినవిల్లి శ్రీసిద్ధివినాయకా ఆలయాన్ని రకరకాల పువ్వులతో సుందరంగా అలంకరించారు. శ్రీసిద్ధివినాయకుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు, ఆలయ మండపాలు భక్తులతో కిటకిటలాడాయి. సిద్ధివినాయక ఆలయం వద్ద సంప్రదాయబద్ధంగా భోగి పండుగ నిర్వహించారు. భోగిమంటలు వేసి గంగిరెద్దులతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

రాయవరం: మండలంలోని వాడవాడలా భోగి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు.గ్రామాల్లో పలు వీధుల్లో భోగిమంటలు వేశారు. చిన్నారులు భోగి మంటల్లో భోగిదండలు వేశారు. మహిళలు వీధుల్లో రంగవల్లులు వేశారు. మండలంలోని పలు వైష్ణవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

యానాం: యానాం నియోజవర్గంలో భోగి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కూనంరెడ్డి జంక్షన్, వెంకటనగర్, జిక్రియానగర్, వికాశ్‌కాలనీ, అగ్రహారం, ధోబీవీధి, చింతావారివీధి, కొత్తపేటతో పాటు అన్నిగ్రామాల్లో యువతి, యువకులు భోగిపండుగ సంబరాలు జరుపుకున్నారు. స్థానిక కొత్తపేట గ్రామంలో సంబరాలను నిర్వహించారు. ఈసందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి భోగిమంటను వెలిగించి సంక్రాంతి వేడుకలకు శ్రీకారంచుట్టారు. 150అడుగుల భోగి దండను మంటలో వేశారు. హరిదాసు సంకీర్తన, గారడీ విన్యాసాలు సాగాయి. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మామిడికుదురు: పాశర్లపూడిలంకలోని తెలగారెడ్డి కుటుంబ సభ్యులు ఒకచోట చేరి సంక్రాంతి సంబరాలను ఉల్లాసంగా.. ఉత్సాహంగా నిర్వహించారు. భోగిరోజు ఆదివారం భోగిమంట వేసి మంటచుట్టూ పాటలు పాడుతూ ఆనందం పంచుకున్నారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సంబరాలు జరగ్గా బుల్లితెర నటుడు తెలగారెడ్డి కల్కిరాజ్ పాల్గొన్నారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కొమరాడలోని శ్రీపాళ్లమ్మ అమ్మవారి వీధిలో కాపవరపు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 160అడుగుల భోగిపిడకల దండను ఊరేగింపుగా తీసుకువచ్చి మంటలో వేశారు. మొగలికుదురులోని వంద అడుగుల దండను ఊరేగింపుగా తీసుకువచ్చి భోగిమంటలో వేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: పల్లెల్లో సందడే సందడి. పట్టణాల నుంచి జనం తరలిరావడంతో పల్లెల్లో పండుగ శోభ సంతరించుకుంది. భోగి పండుగను ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. భోగి మంటల వద్ద చిన్నారులు, యువత సందడి చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ఉప్పలగుప్తం: వేకువజామున యువత ఆధ్వర్యంలో గ్రామాల్లో భోగి మంటలు వేశారు. ఉదయాన్నే చిన్నారులు భోగి పిడకల దండలతో మంటల చుట్టూ ప్రదక్షిణ చేసి దండలను మంటలో వేసి వందనం సమర్పించారు. భీమనపల్లిలో ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి ఆధ్వర్యంలో చిన్నారులకు భోగి పళ్లు పోశారు. బొమ్మలకొలువు ఏర్పాటు చేసి చిన్నారులకు బహుమతులందించారు.

కపిలేశ్వరపురం: భోగి పండుగను మండల ప్రజలు ఆదివారం అత్యంత కోలాహలంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులు వీధి శివార్లలో వేసిన భోగి మంటల్లో భోగి దండలు వేశారు. భక్తులు పలు ఆలయాలను సందర్శించి, స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆనందోత్సవాల నడుమ భోగి పండుగను జరుపుకున్నారు.

కె.గంగవరం: మండలంలోని భోగి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామాల్లో భోగి మంటలు వేశారు. ప్రజలు నూతన వస్త్రాలు ధరించి భోగి పిడకల దండలు భోగి మంటల్లో వేశారు. పేకేరులో సాయిబాబా ఆలయం వద్ద కోలాటం ప్రదర్శన చేశారు.

మలికిపురం: మండల పరిధిలో సంక్రాంతి సంబరాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద భోగిమంటలు వేశారు. కేశనపల్లిలో 500 మీటర్ల భోగి పిడకల దండను భోగిమంటలో వేశారు.

పి.గన్నవరం: ముంగండ ముత్యాలమ్మ వీధిలో పాలూరి సాయిపవన్, శివసూర్య, రామ్, లక్ష్మణ్, ప్రవీణ్, ఐశ్వర్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 200 అడుగుల భోగిపిడకల దండను గ్రామంలో ఊరేగించి భోగి మంటలో వేశారు. జనసేన పార్టీ నాయకులు దైవాల రాంబాబు ఇంటి వద్ద 200అడుగుల భోగిపిడకల దండను సంప్రాదాయ దుస్తులు ధరించి ఊరేగించారు. గ్రామాల్లో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రామాల్లో పలు కుటుంబాల్లో శ్రీకృష్ణుడుకి భోగి పళ్లు వేసి పూజలు నిర్వహించారు. మహిళలు చిన్నారులపై భోగి పళ్లవేశి ఆశీర్వాదించారు.

కీడు తొలగాలి-ఏపీ వెలగాలి
భోగి మంటల్లో జీవో ప్రతుల దహనం



మండపేటలో భోగిమంటలో జీవో ప్రతులు వేస్తున్న దృశ్యం

అమలాపురంటౌన్, జనవరి14: అమలాపురం హౌసింగ్ బోర్డులోని టీడీపీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. భోగి సంకల్పంలో భాగంగా కీడు తొలగాలి-ఏపీ వెలగాలినినాదంతో ప్రభుత్వం ప్రజాభిప్రాయాలకు భిన్నంగా విడుదల చేసిన జీవో ప్రతులను భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. నాయకులు అల్లాడ స్వామినాయుడు, చిక్కాల గణేష్, పెచ్చెట్టి విజయలక్ష్మి, పట్నాల రమణ, భాస్కర్ల రామకృష్ణ, జంగా అబ్బాయి వెంకన్న, జనసేన నాయకులు డీఎంఆర్ శేఖర్, లింగోలు పండు, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: వైసీపీ ప్రభుత్వం రోజురోజుకు ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు సీఎం జగన్ చీకటి జీవో నెం1 తీసుకువచ్చారని టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు ఆరోపించారు. అంబాజీపేట వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద ఏర్పాటుచేసిన భోగిమంటల్లో చీకటి జీవోలు వేసి దహనం చేశారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, నాయకులు చిన్నం బాలవిజయరావు, అరిగెల బలరామమూర్తి, పెదపూడి శ్రీనివాసరావు, వక్కలంక బుల్లియ్య, యడ్లపల్లి తుక్కియ్య గుమ్మడి వెంకటేశ్వరరావు, కొప్పినీడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపేట: అరాచకాలు, అక్రమాలతో రాజ్యమేలుతున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. బండారు బులిసత్యం-చంద్రావతి కాపు కల్యాణ మండపం ఆవరణలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేసిన భోగి మంటల్లో ప్రభుత్వ అరాచకాల ప్లకార్డులు, జీవో ప్రతులను దహనం చేశారు. రాష్ట్రానికి కీడుపోవాలి వెలుగు రావాలని నినాదాలు చేశారు.

మలికిపురం: జీవో నంబరు 1 ప్రతులను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో తూర్పుపాలెంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. రాష్ట్రంలో అడ్డగోలు జీవోలతో రాక్షస పాలన కొనసాగుతుందన్నారు. రాజోలు నియోజకవర్గ జనసేన, టీడీపీ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, బొంతు రాజేశ్వరరావు, యెనుముల వెంకటపతిరాజా, రాజోలు, మలికిపురం ఎంపీపీలు కేతా శ్రీనివాస్, ఎంపీ సత్యవాణి, అడబాల సాయిబాబు, గుబ్బల శ్రీనివాస్, అడబాల హరినాథ్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, అడబాల సంజయ్, గాలిదేవర వెంకన్నబాబు, ఒగ్గు ఏసు పాల్గొన్నారు.

మండపేట: సీఎం జగన్ పాలనకు ఎన్నికల్లో ప్రజలు చరమగీతం పాడటం ఖాయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం వైసీపీ ప్రభుత్వ వైఫల్య జీవో ప్రతులను భోగి మంటలో వేశారు. ఈప్రభుత్వం భోగిమంటలో కాలిబూడిదై పోవాలని నినాదాలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, రమేష్ రాజు, వీరబాబు, వేణు, రామకృష్ణచౌదరి, ప్రదీప్ పాల్గొన్నారు.

వెండి బిందెలు బహూకరణ

అయినవిల్లి, జనవరి 14: నవరప్పాలెం గ్రామానికి చెందిన నూలు సాయిదీపక్, కుటుంబ సభ్యులు అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి రూ.1.50లక్షలు విలువైన 2.048కిలోల రెండు వెండి బిందెలను బహూకరించారు. దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు దాతను అభినందించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఎస్సీల 27 పథకాలను పునరుద్ధరించాలి

మామిడికుదురు, జనవరి 14: ప్రభుత్వం రద్దుచేసిన 27పథకాలను పునరుద్ధరించాలని దళిత, కాపు సంఘ నాయకులు డిమాండుచేస్తూ ఈదరాడ సిద్ధార్థపేటలో భోగిమంటవేసి నిరసన తెలిపారు. కలిగితి పల్లంరాజు, నల్లి శ్రీనివాస్, బత్తుల జనార్ధన్, నూటుకుర్తి సత్యనారాయణ, బొంతు మణి రాజు, జాలెం సుబ్బారావు, నామన నాగేష్, యెరుబండి చిన్నీ పాల్గొన్నారు.

భోగి పండుగ రోజున అంగన్‌వాడీల నిరసన




అమలాపురం కలెక్టరేట్, ముమ్మిడివరంలలో భోగి మంటల్లో ఎస్మా జీవో ప్రతులు దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

అమలాపురం టౌన్, జనవరి 14: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట 24గంటల నిరాహార దీక్షను వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సంక్రాంతికి దూరమయ్యామంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ సంక్రాంతిని ప్రతిబింబించేలా శిబిరం ఎదుట భోగి మంటలు వేసి ప్రభుత్వం అంగన్‌వాడీలపై ప్రయోగించిన ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. అంగన్‌వాడీల సంఘ జిల్లా కోశాధికారి పి.అమూల్య, డి.మణికుమారి, ఎస్.శాంతి, కె.పరిపూర్ణ, డి.లక్ష్మి, ఆర్.సూర్యావతి, పి.తులసి, కె.రజియా, పి.భవానీ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సీడీపీవో కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంవద్ద భోగి మంటలువేసి వాటిలో ఎస్మా జీవో ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ శిబిరాన్ని సందర్శించారు. ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, కె.వెంకటలక్ష్మి, నాగరత్నం, విజయకుమారి, అంజలీదేవి, యశోద, వి.తలుపులమ్మ, విజయ, ఐ.మంగాయమ్మ, చైతన్య, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పి.గన్నవరం: సీఎం జగన్మోహనరెడ్డి విడుదల చేస్తున్న ప్రజావ్యతిరేక జీవోలను వెంటనే రద్దు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అన్నారు. లంకలగన్నవరంలో ప్రజావ్యతిరేక జీవోల ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు.టీడీపీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ అంకాని సత్తిబాబు, నంసాని పెద్దిరాజు, ఆరుమిల్లి లాల్‌బాబు, శేరు శ్రీనుబాబు, లంకే చిరంజీవి, వేమన రామకృష్ణ, బండారు శ్రీను, వేమన గంగాధర్ పాల్గొన్నారు.

రామచంద్రపురం: స్థానికమున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం 34వరోజు దీక్షా శిబిరంలో అంగన్వాడీలు పాల్గొన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వాసంశెట్టి సూర్యకుమారి, విజయలక్ష్మి, శ్రీదేవి, జహారా, దుర్గ, వెంకటరత్నం, గొంతీదేవి, వీరవేణి, లక్ష్మీ కాంతం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మండపేట: సమస్యలు పరిష్కరించకుండా సీఎం జగన్ అంగన్‌వాడీల పట్ల చూపిస్తున్న నిర్లక్ష్యంపై అంగన్‌వాడీలు ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద భోగి మంట వేశారు. అక్కడ డ్యాన్స్‌లు వేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీలు ప్రభుత్వ తీరును ఎండగట్టివ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మామిడికుదురు: అంగన్‌వాడీలు ఆదివారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద భోగి మంటవేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

NAME CHANGE

I GUBBALA NAGA RAJU S/o KRISHNA MURTHY D.No.2-7, medicharlapalem village malikipuram mandal, Dr. B.R. Ambedkar Konaseema Dist. A.P.-533244. I Hence by declare that my name has been changed from GUBBALA RAJU (old name) to GUBBALA NAGA RAJU (new name). Hence all my documents and Correspondence will continue with my new name of Gubbala Naga Raju.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అంబాజీపేట, జనవరి 14: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము.. చదువుల చెట్టు నీడలో అంటూ పుల్లేటికుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1998-99 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా ఒకే చోటకు చేరుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. 22మంది గురువులను సత్కరించారు. తోటి విద్యార్థులు నలుగురు మృతిచెందడంతో వారికి ఒక్కొక్కరికి రూ.20వేలు వంతున అందించారు. నేదునూరి ఏసమ్మ కుమారుడు జశ్వంత్ అగ్నిప్రమాదంలో గాయపడటంతో రూ.80వేలు ఫిక్సిడ్ డిపాజిట్, రూ.50వేలు నగదు అందించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. సర్పంచ్ జల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: పసలపూడి పాఠశాల1982-92 వరకు 1నుంచి పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పలకరింపుల పులకరింతలతో సాగింది. పాఠశాల ప్రాంగణంలో కలియతిరిగి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఆ నాటి గురువులను ఘనంగా సత్కరించారు.

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో 1993-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28ఏళ్ల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు నిమ్మకాయల ప్రసాద్, నల్లా శ్రీధర్, గొవ్వాల రాజేష్, పిండి శేషు, కుకునూరి సుబ్రహ్మణ్యం తదితరుల ఆధ్వర్యంలో అధ్యాపకులు డాక్టర్ పైడిపాల కనకరాజు, వక్కలంక కృష్ణమోహన్ తదితరులను సత్కరించారు.

ఇల్లు దగ్ధం

కె.గంగవరం, జనవరి 14: భట్లపాలికలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం నూకపెయ్యి ఈశ్వరరావుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఇంటిలో ఉన్న రూ.80వేలు నగదు, బంగారు ఆభరణాలు, దుస్తులు, వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. స్థానికుల సహాయంతో మంటలను ఆర్పివేశారు. ఈశ్వరరావు కుటుంబం రోడ్డున నిరాశ్రయులైంది.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: గుంటూరు కారం
వెంకటరమణ	: సైంధవ్
శ్రీలలిత	: గుంటూరు కారం
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: నాసామిరంగ
రమా	: గుంటూరు కారం
గణపతి	: నాసామిరంగ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: గుంటూరు కారం
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

ఓడలరేవు బీచ్‌లో వేడుకగా కైట్ ఫెస్టివల్

అల్లవరం, జనవరి 14: ఓడలరేవు సాగరతీరాన గాలి పటాల పండుగ(బీచ్ కైట్‌ఫెస్టివల్)ను అధ్యక్షుడు తాడి ధర్మారావు ఆధ్వర్యంలో ఉత్సాహంగాసాగింది. అమలాపురంతాలూకా అగ్నికుల క్షత్రియ సంక్షేమసంఘ అధ్యక్షుడు కొల్లు సత్యనారాయణమూర్తి(బాబ్జి) బీచ్‌కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. యువతీ యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగుర వేశారు. పాల వెంకటేశ్వరరావు, పెమ్మాడి రమేష్, మెరైన్ ఎస్ఐ జి.విలియమ్స్, సోమాని వెంకటరమణ, కలిగితి ఏసురత్నం, తారాడి ఉమామహేశ్వరరావు, తారాడి ధనుంజయ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

కె.గంగవరం, జనవరి 14: కూళ్లలో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.51లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆదివారం భూమి పూజ చేశారు. ఆయనకు గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చిట్టూరి చిన్ని ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వాగతం పలికారు. జుత్తుగ శ్యామ్‌ప్రసాద్, వల్లభరెడ్డి చిన్ని, దుర్గారావు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

అల్లవరం, జనవరి 14: ఓడలరేవుకు చెందిన కర్రి రాంబాబు (35) ఆదివారం ఉదయం ఓఎన్జీసీ రోడ్డులో చేపల చెరువులో ప్రమాదవశాత్తూ జారిపడి చనిపోయాడు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. రాంబాబు ప్రమాదవశాత్తూ మరణించాడని ఎస్ఐ హరీష్‌కుమార్ కేసు నమోదుచేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కాట్రేనికోన, జనవరి 14: పల్లంకుర్రులో శనివారంరాత్రి ట్రైనీ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో స్థానికపోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. రూ.1,42,800 స్వాధీనం చేసుకుని, భూపతిరాజుశివకుమార్‌వర్మ(గబ్బర్‌సింగ్), మరో21మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రావులపాలెం: ఊబలంకలో చిన్నారులు బొమ్మల కొలువు ఏర్పాటుచేసి ఆకట్టుకున్నారు. చిన్నారులు భోగి మంటలు వేసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

అంతర్వేది, జనవరి 14: వీవీమెరక, శృంగవరప్పాడు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సర్పంచ్‌లు ఓగూరి రత్నకుమారి, రావి నాగవెంకటలక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజులు మాట్లాడుతూ పేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రధాని మోదీ అందిస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, ఈవోపీఆర్డీ కె.సూర్యనారాయణ, ఏపీవో నాగప్రసాద్, యెనుముల సుబ్బారావు, రుద్రరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు అవుట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన

యానాం, జనవరి 14: పెండింగ్ వేతనాలు ఇవ్వాలని యానాం ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆదివారం అవుట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన 12వ రోజుకు చేరుకుంది. ఆదివారం భోగి రోజు కూడా వారు ఆందోళనను కొనసాగించారు. సిబ్బందికి పలువురు సంఘీభావం తెలిపారు.

వైభవంగా గోదాదేవి, రంగనాధుల కల్యాణం



మామిడికుదురు: అప్పనపల్లిలో గోదాదేవి కల్యాణం దృశ్యం

అంబాజీపేట, జనవరి 14: అంబాజీపేట పెద్దవీధిలోని ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి రంగనాధుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవల్లి బదరినారాయణాచార్యులు పర్యవేక్షణలోతొలుత ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వేదమంత్రోచ్ఛారణల నడుమ ఆలయ అర్చకులు పెద్దింటి మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపారు. అంగర వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు కె.బాలబాలాజీ ఆచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణం ఘనంగా జరిగింది.

ద్రాక్షారామ: ఆదివారపుపేట శివబాలయోగి ఆశ్రమంలో ఆదివారం గోదాదేవి రంగనాథ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. గణపతి పూజ, పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అనంతరం సుమూహూర్తం జరిపారు. వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ మాంగళ్యధారణ జరిగింది. తదుపరి తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణ మహోత్సవం తిలకించారు.

ఆలమూరు: గుమ్మిలేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రెడ్డి చిట్టిబాబు-సత్యవాణి దంపతులతో గోదా-రంగనాథుల కల్యాణాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో గోదాదేవి కల్యాణాన్ని ఆదివారం నిర్వహించారు. కల్యాణంలో 200మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొనగా అర్చకులు శాస్త్రోక్తంగా గోదాదేవి కల్యాణాన్ని నిర్వహించారు. గోదాదేవి కల్యాణంతో ఆండాళ్‌తాయారు ధనుర్మాస దీక్ష ముగుస్తుంది. ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సభ్యులుపాల్గొన్నారు.

ధ్వజస్తంభం పునర్నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం

ఆత్రేయపురం, జనవరి 14: కట్టుంగ పార్వతీ సమేత సకలేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం పునర్నిర్మాణానికి చిట్టూరి వెంకట్రావు జ్ఞాపకార్థం ఆయన భార్య నాగరత్నం రూ.5,00,116లు విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేసింది.



నేడు 'స్పందన' రద్దు

అమలాపురం టౌన్, జనవరి 14: మకర సంక్రాంతి పండుగ సెలవు రోజు కావడంతో జిల్లా స్థాయిలో 'స్పందన'ను సోమవారం నిర్వహించట్లేదని కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. అర్జీదారులు ఈవిషయాన్ని గమనించాలన్నారు.